# మినీ కథలు.....

## ఆ సుందరి...

సమయం తొమ్మిదిన్నర దాటుతోంది. ఇంతవరకు అడ్రసులేని సిటీబస్సును తిట్టుకుంటూ బస్ స్టాపులోనే అసహనంగా అటూఇటూ కదలసాగాను. ఉదయం ఆరు గంటలకే లేచి కాలకృత్యాలు కానిచ్చి ఇంత కాఫీ గొంతులో పోసుకుని ఆదరాబాదరా బస్‌స్టాప్‌కు పరుగెత్తుకొచ్చాను. అప్పటికే మద్రిపాలెం బస్ షెల్టర్ జనాలతో కిటకిట లాడుతోంది. ఆఫీసుకు చేరటానికి ఆత్రపడేవారు, స్కూలు కోసం తపించేవారు, ఆఖరుకు మార్నింగ్‌షో పిక్చరుకోసం థియేటర్లని పావనం చేసేవారు అందరూ అందులోనే!

మా ఆవిడ బాబిగాణ్ణి ఎత్తుకున్నట్టు కుడి చంకలో బరువెక్కిన ఫైళ్ళని ఎడమ చంకకు మార్చుకున్నాను. విసుగ్గా వాచీకేసి చూశాను. తొమ్మిదీ ముప్ఫయ్యయిదు. గుండెల్లో రైళ్ళు కదలనారంభించాయి. పదిన్నర దాటితే అంతే సంగతులు. బాస్ వేసే అక్షింతలు వారం పదిరోజుల వరకు మరపుకురావు. ఎలాగురా దేవుడా అనుకుంటూ బస్సు దర్శనం కోసం అటువైపే చూడ సాగాను— కళ్ళు కాయలు కాసుకుంటూ.

దాహంతో నాలుక పిడచకట్టుకుపోతుంటే ప్రక్క నున్న పాన్‌షాప్‌లో ఓ కూలింగ్ షోడాకు ఆర్డరిచ్చాను. స్టెప్ కటింగ్ కుర్రాడొకడు చిద్విలాసంగా పాన్ నములుతున్నాడు. కాస్త ఎదిగిన, ఎర్రగా బుర్రగా వున్న కాన్వెంటమ్మాయిల్నిచూస్తూ కిళ్ళీకొట్టతనితో కామెంట్ చేస్తున్నాడు. అతనుమాత్రం పెదవి విప్పిన దాఖలాలు లేవుగాని సమధానంగా చిరునవ్వు మాత్రం చిందిస్తున్నాడు. గతవారం రోజులుగా ఇదే సీను... ఇంచుమించు ఇదే టైముకు నాకు ఎదురవుతోంది. ఇలా— బస్ స్టాపులో నిలబడి బస్సుకోసం ఎదురుచూస్తున్న స్కూలు కెళ్ళే ఆడపిల్లల్ని ఆపాదమస్తకం చూపులతో సర్వేచేస్తూ కిళ్ళీ బడ్డీవాడికి కామెంటరీ వినిపించడంఆ స్టెప్ కటింగ్ వాడి దినచర్యలో ఓ భాగమై కూచుంది. వాడీరోజు నీలం రంగు షర్టు మీద బ్రౌన్ కలర్ పాంటు టక్ చేశాడు. కాళ్ళకు కౌబాయ్ షూ, అరంగుళం మందాన ముఖానికి పౌడరు! ఈరోజు కాస్త 'అతి'గా అలంకరించుకున్నట్టనిపిస్తోంది అతని వాలకం.

ఉన్నట్టుండి ఒక్కసారిగా పడీపడీ నవ్వనారంభించాడు. బడ్డీవాడి మొహంలోమందహాసం! అందరూ తలలు తిప్పి వాళ్ళవైపే చూడసాగారు. ఆ కుర్రపక్షి హొయలు, వెకిలివేషాలు వాడి వయసుకు సరేసరి. కాని బడ్డీవాడు... ఎంతలేదన్నా ఐదున్నర దశాబ్దాల వయసు పైబడి రేపో మాపో షష్ఠిపూర్తికి సిద్ధం కానున్న నడివయస్కుడు. ఈవ్ టీజింగ్ కార్యకలాపాలలో పాలు పంచుకోవడం, పైగా బుద్ధి చెప్పాల్సింది పోయి ఓ కుర్రకుంకని ప్రోత్సహించడం... నాన్‌సెన్స్! ఇక చూడలేక తల అటువైపు తిప్పేసుకున్నాను.

మెల్లగా వీచిన గాలికి అలలుగా తేలివచ్చి నాసికా రంధ్రాలకు సోకింది— పాండ్స్ పౌడర్ పరిమళం. నా ప్రక్కనుంచి నడిచివెళుతోంది ఓ పదిహేనేళ్ళ అమ్మాయి. ఇప్పుడిప్పుడే యవ్వన ప్రాంగణంలో అడుగుపెడుతూ విరిసీ విరియని మొగ్గలా వున్న ఆమె— స్టెప్ కటింగ్‌వాడి కళ్ళలో పడింది. వెంటనే వ్యాఖ్యలు విసర సాగాడు. "వారెవా! చూడండి గురూగారూ! ఏం ఫిగరూ! దానిముందు సినిమావాళ్ళు బలాదూర్..." అంటూ ఏవేవో అనేంతలో వాడి చెంప 'ఛెళ్ళు' మంది. అప్పటికే సీట్లోంచి కిందికి దూకి నిప్పులు గక్కుతూ వాడి జుట్టు దొరకబుచ్చుకున్న కిళ్ళీకొట్టు అసామీ రెండు క్షణాలలో వాణ్ణి చిత్తుగా తన్నాడు.

ఊహించని హఠాత్ పరిణామం నుంచి అందరూ తేరుకునేంతలో— బుగ్గలు బూరెల్లా పొంగి దానిమ్మ పళ్ళలా విచ్చిపోయి, బల్లిలా నేలకు కరుచుకుపోయిన అతగాడిని రెక్క పుచ్చుకు లేపాడు. "ఒరేయ్! మస్తాన్! వీడిని హాస్పిటల్‌కు చేర్చరా" అంటూ ఆటో వాడికి అప్పగించాడు.

** ** **

ఈరోజు... ఆ అమ్మాయే! హంస నడకలతో ఒయ్యారంగా నడుస్తూ ఆ కిళ్ళీబడ్డీవాలాను సమీపించి "థాంక్సండీ! నిన్న... వాడికి తగిన బుద్ధి చెప్పారు" అంటూ అతనికి కృతజ్ఞతలు చెప్పుకోలేదామె. "నాన్నా! ఇదిగో బటర్‌మిల్క్, అమ్మపంపించింది. నాస్కూలుకు టైమవుతోంధి. తొందరగా తీసుకో" అంటూ ఓ కూజా ఆ ఆసామికి అందించి, పుస్తకాలు తీసుకుని సాగిపోయింది.

పాట్నీడి చక్రరావు

## ఓ స్త్రీ! రేపురా

రాత్రి 11గంటల సమయం. వీథులన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. అప్పుడే బండి దిగిన సుందరమ్మ రిక్షా కోసం ఎంతసేపు వెదికినా దొరకలేదు. రిక్షాల వారు సమ్మె చేస్తున్నారా ఏమిటి అనుకుంటూ చేతి సంచీతో నడవసాగింది. మేనల్లుడి ఇల్లు స్టేషనుకి దగ్గరే. కనుక బ్రిడ్జి మెట్లు ఎక్కి ఎలాగో ఇల్లు చేరింది. ఆమె మరిది కూతురు పెళ్ళి. పెళ్ళివారిల్లు దూరం. తెల్లవారిన తరువాత వెళ్ళవచ్చులే అనుకుని ఇలా చేసింది. నడిచి వచ్చిన వగర్పుతో, తలుపు తడుతూ నాయనా! సత్యం! అని పిల్చింది. మంచి నిద్రలో వున్నట్లున్నారు అనుకుని మళ్ళీ గట్టిగా బాదింది. ఉహూ! ఎవరూ లేవలేదు. ఊళ్ళో లేరా ఏమిటి అనుకుని, తలుపు గొళ్ళెం వైపు చూస్తే తాళం వేసిలేదు. మరీ ఇంత మొద్దు నిద్రేమిటి అని, సత్యం నేనురా మీ అత్తయ్యని తలుపు తియ్యరా అని దబదబ బాదింది. నిజానికి ఆమె చేసిన చప్పుడుకి ఇరుగు పొరుగు వారు అంతా బయటకు రావల్సిన మాట. అప్పటికి ఇంకా అందరూ నిద్ర కూడా పోయే అవకాశం లేదు. పోనీ పక్కింటి వాళ్ళను అడిగితే సరిపోతుంది అనుకొని వాళ్ళ తలుపు తడ్తే, అక్కడా ఎవరూ పలకలేదు. ఇంత గోలగా అరుస్తున్నా ఎవరూ పలకరే? ఈ వీథంతా ఖాళీ చేసి పోయూరా అన్న అనుమానం వచ్చింది. కాళ్ళు పీక్కుపోతుంటే ఆ గుమ్మం ముందు మెట్టుమీద చతికిల బడ్డది. చేతిసంచి లోని సీసాలో మిగిలిన నీళ్ళు తాగి, అలాగే తలుపుకు జార్లబడి కూర్చుంది. ప్రయాణపు బడలికతో నిద్ర ముంచుకొస్తే అక్కడే మేను వాల్చింది.

తెల్లవారు ఝామున 5-30కి తలుపు తీసుకుని పాలకి వెళ్దామని వచ్చిన సత్యం గుమ్మంలో వదిగి పడుకున్న మేనత్తని చూసాడు. కొంచెం జంకినట్టుగా ఆమె పాదాలవైపు చూసి, ధైర్యం తెచ్చుకుని, ఆమెను లేపాడు. సుందరమ్మ రాత్రి పడ్డ యాతన అంతా చెప్పింది. "నీకు చీమ చిటుక్కుమంటే మెలకువ వస్తుంది గదరా మరి అంత బాదినా లేవలేదే" అంది. నీవు లోపలికి పద నేను పాలు తీసుకొచ్చి నీకు అంతా వివరంగా చెబుతాను అని వెళ్ళాడు. అతను తిరిగి వచ్చే సరికి భార్య వివరిస్తున్నది. అయితే నేను పిల్చింది మీకు వినబడ్డదా? అంది సుందరమ్మ. ఔను అత్తా! ఇక్కడ ఈ మధ్య ఒక వార్త ప్రచారంలోకి వచ్చింది. రాత్రి పూట ఒక దయ్యం ఆడదాని రూపంలో వచ్చి తలుపు కొడుతుందని, మన బంధువుల గొంతుతోనే మాట్లడుతుందని, తలుపు తీస్తే వికృతంగా కనబడి, మనల్ని పీక్కు తింటుందని, ఆ విధంగా ఇప్పటికి ఆరుగురు చనిపోయారని చెప్పుకుంటున్నారు. అందుకే రాత్రి పది దాటితే ఎవరూ తలుపు తీయడం లేదు. రాత్రి నీ పిలుపు మాకు వినపడింది గాని, అది దయ్యం పనేనని మేము ఊపిరి బిగపట్టి హనుమాన్ చాలీసా చదువుకుంటూ కూర్చున్నాము. ఈ వార్త పేపర్లలో కూడా వచ్చింది. నీవు చూడలేదా? అన్నాడు సత్యం. లేదు అన్నట్లుగా తల తిప్పింది సుందరమ్మ. అందుకే ప్రతి వాళ్ళ తలుపుల మీద "ఓ స్త్రీ! రేపురా!" అని రాస్తున్నారు. అలా రాస్తే ఇక ఆ యింటికి రాదుట. వివరించింది సత్యం భార్య. ఇవన్నీ ఒట్టి పుకార్లురా! వెనుకటికి పాతికేళ్ళనాడు ఇలాగే అష్ట గ్రహ కూటమి అని, ఇలాగే దయ్యాలు వస్తాయని, నామాలు పెడితే, తలుపుల మీద, ఇక రావని పెట్టారు. ఏమయింది? ఇలాటి మూఢనమ్మకాలు పెట్టుకుంటే, ఒక్కొక్కసారి ప్రమాదాలు కూడా వస్తాయి. ఎవరికైనా ప్రాణం మీదకొస్తే ఏ డాక్టరు దగ్గరకైనా వెళ్ళాలంటే, ఎవరూ ఇలా తలుపులు తీయక పోతే ఏమవుతుంది? అందుకా రాత్రి మీ ప్రక్కవాళ్ళు కూడా తలుపు తీయలేదు! అంది సుందరమ్మ ఆమె మాటలోని యదార్థం గ్రహించి సత్యం తమ తలుపు మీదరాసిన "ఓ స్త్రీ! రేపురా!"ని తుడిపి వేశాడు.

పాలపర్తి శ్యామలాదేవి